# విశ్వనాథ కవిత్వం

- భైరవభట్ల కామేశ్వరరావు

*"చిరుత తొలకరివానగా... చిన్ని సొనగ...పొంగి పొరలెడు కాల్వగా... నింగి కెగయు కడలిగా... పిల్లగ్రోవిని వెడలు వింత తీయదనముల లీనమై పోయె నెడద"*

ఇది కృష్ణశాస్త్రి పద్యం. కృష్ణుని మురళీగానం చిన్న తొలకరివానగా మొదలై, క్రమక్రమంగా పెరుగుతూ పోయి, నింగి కెగసే కడలిలాగ ఎలా ముంచెత్తిందో వర్ణించే పద్యం.

విశ్వనాథ కవిత్వం నన్ను ముంచెత్తింది కూడా సరిగ్గా ఇలాగే! ఎప్పుడో మొదటిసారి, ఎవరి గొంతులోనో, కొండవీటి పొగమబ్బుల పద్యాన్ని విన్నప్పుడు నా మనసు కూడా ఒక పొగమబ్బై కొండవీటి బురుజులపైన తేలిపోయిన అనుభూతి. విశ్వనాథతో అదే నా తొలిపరిచయం. అలా మొదలైన ఆ పరిచయం *ఆంధ్ర పౌరుషం, ఆంధ్ర ప్రశస్తి, తెలుగు ఋతువులు*, ఇలా ఇలా పెరిగి పెరిగి రామాయణ కల్పవృక్ష పరిచయంతో ఒక గాఢమైన అనుబంధంగా మారింది. తీరా చూస్తే విశ్వనాథ సాహిత్యంలో నేను చదివినది మొత్తం కలిపి ఒక పావువంతు కూడా ఉండదు! మరి ఇంతటి అభిమానానికి కారణమేమిటి?

నాకు తెలుగు పద్యమంటే, ఇంకా కచ్చితంగా చెప్పాలంటే తెలుగు పద్య కవిత్వమంటే చాలా ప్రీతి. నన్ను విశ్వనాథకి దగ్గర చేసినవి ముమ్మాటికీ ఈ మూడు మాటలే! "తెలుగు", "పద్యం", "కవిత్వం". తెలుగుదనం, పద్య రచనా వైదుష్యం, గాఢమైన కవిత్వం. విశ్వనాథ సాహిత్యానికున్న వేయిపడగలలో తక్కిన పడగల మాట నేను చెప్పలేను కాని, ఈ మూడు పడగలూ మాత్రం అచ్చమైన అమృతాన్నే చిందిస్తాయి. ఆ అమృత సాగరంలోనే నా మనసు లీనమైపోయింది.

దాన్ని ఒక చిన్న చెంచాలో మీకందించే ప్రయత్నమే యీ వ్యాసం.

**తెలుగుదనం**

ఇమ్ముగ కాకుళమ్ము మొదలీ వఱకుంగల యాంధ్ర పూర్వ రా
జ్యమ్ముల పేరు చెప్పిన హృదంతర మేలొ చలించిపోవు నా
ర్ద్రమ్ముగ చిత్తవృత్తుల పురాభవ నిర్ణయమేని నెన్ని జ
న్మమ్ములుగాగ నీ తనువునన్ బ్రవహించునొ యాంధ్ర రక్తముల్

"పూర్వాంధ్ర రాజ్యవైభవం గురించి విన్నప్పుడల్లా ఎందుకో మనసంతా ఆర్ద్రమైన భావాతిరేకంతో సంచలించిపోతుంది. బహుశా ఎన్నో జన్మలుగా నా యీ శరీరంలో ఆంధ్ర రక్తాలు ప్రవహిస్తూ ఉన్నాయి కాబోలు!"

ఒంట్లో తెలుగు రక్తం ప్రవహించే ఎవ్వరికైనా ఇలాటి పద్యాలు చదినప్పుడు అది ఉరకలెత్తక మానుతుందా చెప్పండి!

*ఆంధ్రప్రశస్తి* కావ్యం నిండా ఇలాటి తెలుగుదనమే. గుండెలని పొంగించే తెలుగుదనం. "ఇంతకు ముందెప్పుడో – ఇక్కడ, యీ ఆంధ్రదేశంలో, గడ్డిపోచలు కూడా వాడి కత్తులై శత్రువుల కుత్తుకలను ఉత్తరించిన కాలంలో, నువ్వూ నేనూ తోడి సైనికులమై చేసిన స్నేహం కాబోలు మన ఈ అనుబంధం" అని ఆంధ్రప్రశస్తిని అంకితం చేస్తూ మల్లంపల్లి సోమశేఖరశర్మగారితో అన్న విశ్వనాథలో అణువణువూ ఆంధ్ర పౌరుషం ఉరకలు వేసి, మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఇప్పటి చాలామందికి తెలియని ఆంధ్రుల పూర్వ ప్రశస్తిని పద్యాలలో మధురంగా గానం చేసారు విశ్వనాథ. ఆంధ్ర మహావిష్ణువుతో మొదలుపెట్టి, శాతవాహనుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, మాధవవర్మ, వేంగీ క్షేత్రము, ముఖలింగము, నన్నయ భట్టు, ప్రోలరాజు, కొండవీటి పొగమబ్బులు, చంద్రవంక యుద్ధము, అళియరామరాయల వరకూ తెలుగు చరిత్రలోని ముఖ్య సన్నివేశాలని, ముఖ్య ప్రదేశాలని, వ్యక్తులని కథలు కథలుగా కవితాత్మకంగా మనకి పరిచయం చేసే కావ్య మాల ఆంధ్ర ప్రశస్తి.

కొందరికిది "మా తాతలు నేతులు తాగారు, మా మూతులు నాకండి" అన్నట్టుగా అనిపించవచ్చు. కాని "మన" అనే భావనలోంచి అసంకల్పితంగా పొంగుకొచ్చే ఆనందాతిశయం యిది. ఈ మధ్యనే మన రహమాన్ ఆస్కారు అవార్డులు గెలిస్తే భారతదేశమంతా "జై హో" అన్నది ఎందుకు? ఈ "మన" అనే భావం వల్లనే కదా. అలాగే మన పూర్వ చరిత్రను, దాని వైభవాన్నీ కీర్తించి "జయహో" అన్నారు విశ్వనాథ. "ఆంధ్రప్రశస్తి"లో చారిత్రక దృష్టి కనిపిస్తే, "ఆంధ్రపౌరుషము" కావ్యంలో తెలుగువాళ్ళ పౌరుషం ఉరకలు వేస్తుంది. ఆ పౌరుషమంతా యిప్పుడేమైపోయింది అన్న ఆర్తి ప్రతి అక్షరంలోనూ ధ్వనిస్తుంది.

నేటి ఆంధ్రులు గుడ్డకు గూటి కున్న
చాలు ననువారలైనారు, చచ్చిపోయె
నేమొ జాతీయ సత్వంబు, కోమలంబు
మల్లికకు నీరులేకున్న మాడిపోదె!

జాతీయ భావన అనే శక్తి లేకపోతే నీరులేని మల్లికలాగా జాతి మాడిపోదా అని ఆక్రోశించారు విశ్వనాథ. అయినా అతనికి ఆంధ్ర పౌరుషం మీద, ఆంధ్ర జాతి మీద ఉన్న నమ్మకం అపారం. ఏదో పొరపాటున ఇలా ఉంది కాని, నిజానికి "తెనుగు చురకత్తి పదునుకు తిరుగులేదు" అంటారు.

విశ్వనాథలోని తెలుగుదనం "ఆంధ్రపౌరుషం", "ఆంధ్రపశస్తి" కావ్యాలలో మాత్రమే కాదు, అతని ప్రతి రచనలోనూ ఉట్టిపడుతుంది. ఆరు ఋతువులని వర్ణించినప్పుడు కూడా, ఆయా ఋతువుల్లో తెలుగుదేశంలోని వాతావరణం మన కళ్ళకి కట్టిస్తారు. అందుకే అవి "తెలుగు ఋతువులు" అయ్యాయి.

"పేరంటమున కేగు పిన్న బాలిక వాలు జడ మల్లెమొగ్గ కన్పడినయంత" వసంతం వచ్చిందని తెలుస్తుందిట! ఎంత చక్కని ఊహ!

తెలుగుదనంలో మునకలేసిన విశ్వనాథ, తన రామాయణ కల్పవృక్షంలో, మరీ ముఖ్యంగా బాలకాండ అంతటా కూడా తెలుగుదనం రాశులు పోసారు. తెలుగువారి ఇళ్ళల్లో ఉండే మమకారాలు, తల్లిదండ్రులకి పిల్లలకీ మధ్యనుండే వాత్సల్యాలు, తెలుగు పండుగలు, తెలుగువారి ఆచారాలు ఇవన్నీ మనకి బాలకాండలో కనిపిస్తాయి.

రాముడు పుట్టినప్పుడు, పుట్టిన శిశువుపై మంత్రసాని కలినీళ్ళు చల్లి కుదిలించడం, బొడ్డు కోయడం, గోధుమలు పోసి దానిపై చీర పఱచి శిశువుని పడుకోబెట్టడం ఇలా తెలుగిళ్ళల్లో తన కాలంలో జరిగే ఆచారాలన్నిటినీ వర్ణించారు.

బాల రాముణ్ణి ఉయ్యాలలో వేసే సన్నివేశం అది. పేరంటానికి చాలామంది ఆడవాళ్ళు వచ్చారు. రాముణ్ణి ఉయ్యాలలో పెట్టి ఊపుతున్నారు. ఉయ్యాల ఊపేటప్పుడు మరి పాటలు పాడొద్దూ. దానికెవరూ ముందుకు రావడం లేదు. ఆ సందర్భంలో ఒకరినొకరు పాడమంటూ ఎలా మాట్లాడుకుంటున్నారో వినండి:

నోరు పెగలదటే నీకు? నూరక తెగ
రాలిపోవుదు కూనిరాగాలతోడ!
  బిఱ్ఱబిగిసెదు తొట్టెను బెట్టు స్వామి
  నేలగా పాడగా నొక్క జోలపాట
అనరమ్మ యొక్కపాటను,
వనితామణులెల్ల నిటకు వాయనములకై
  చనుదెంచిరో? యెల్లరకును
  నినుమడి దాళాలు పడెనటే నోళులకున్!

"ఏవిటీ ఒక్కళ్ళకీ నోరు పెగలదు? ఉట్టినే ఓ తెగ కూనిరాగాలు తీస్తారే! తొట్టెలో పెట్టిన స్వామిని లాలిస్తూ ఇప్పుడొక్క జోలపాటకూడా పాడరేం? ఒక్క పాటైనా పాడండర్రా! ఇక్కడికందరూ వాయనాలు పుచ్చుకోడానికే వచ్చారా ఏమిటి? అందరికీ నోటికి పెద్ద పెద్ద ఇనప తాళాలు పడ్డట్టున్నాయే!" – ఇదీ వరస. తెలుగుదనం యింకా కాస్తైనా మిగిలున్న ఇళ్ళల్లో ఇప్పటికీ ఇలాటివప్పుడప్పుడూ కనిపిస్తాయి.

ఇలా ఒకటేమిటి, రాముడు పుట్టినదాదిగా సీతా కల్యాణం వరకూ జరిగిన వేడుకలన్నిటిలోనూ మన తెలుగువారి ఆచార వ్యవహారాలే కనిపిస్తాయి. దశరథ పుత్రులు నలుగురినీ పెళ్ళి కొడుకులని చెయ్యడం, కల్యాణ మండపం తీర్చిదిద్దడం, సీతనీ ఆమె ముగ్గురు చెల్లెళ్ళనీ బుట్టల్లో తీసుకురావడం, జీలకఱ్ఱ బెల్లం, తాళి కట్టడం, తలంబ్రాలు, మంగళహారతులు, స్థాలీపాకం, అరుంధతి దర్శనం, అప్పగింతలు ఇలా తెలుగువాళ్ళ పెళ్ళివేడుకలు సమస్తమూ దర్శనమిస్తాయి! వధూవరులు పక్క పక్కన కూర్చుని ఉన్నప్పుడు, ఒకరి వంక ఒకరు చూసుకోవాలన్న ఆకాంక్ష, నేరుగా చూసుకోవడానికి సిగ్గు – ఇలాటి అవస్థ చాలామంది కొత్త దంపతులకి ఉండేదే కదా! దాన్ని ఎంత అందంగా కవిత్వీకరించారో విశ్వనాథ, చూడండి:

ఎదురుబళ్ళైన లజ్జచే నెత్తరాని
ఱెప్పలవి యెత్తబడకుండ గ్రేవలందు
బ్రక్క గూర్చున్న యప్పటి ప్రసరణంబు
ప్రసవబాణుండు నేర్పిన ప్రథమ విద్య

"ఎదురు బళ్ళు" కావడం తెలుగు నుడికారం. కనులెత్తి చూడాలనే ఆకాంక్ష. కాని దాన్ని అడ్డుతున్న సిగ్గు బరువుతో ఱెప్పలని ఎత్తలేక పోతున్నారు. కనులెత్తకుండానే, కంటి చివళ్ళ సందుల్లోంచి పక్కచూపులు చూస్తున్నారు. ఒక్కసారి ఆ అందమైన దృశ్యాన్ని ఊహించుకోండి (లేదా గుర్తు తెచ్చుకోండి!). అలా చూడడం మన్మథుడు ఆ వధూవరులకి నేర్పే మొదటి విద్యట!

ఈ వాతావరణం, యీ ఆచారాలు, యీ సంస్కృతీ వీటన్నిటినీ యిలా కావ్యంలో సంతరించడం వల్ల ఏమిటి ప్రయోజనం? అంటే, ఒకటి మనం మరిచిపోతున్న మనదైన సంస్కృతిని మనకి గుర్తు చెయ్యడం. అంత కన్నా ముఖ్యంగా గత కాలపు సంస్కృతిని ముందు తరాలకి తెలియజెయ్యడం. ఒక రకంగా యిది సాంస్కృతిక చరిత్ర.

ఇంక భాష విషయానికి వస్తే, విశ్వనాథ సంస్కృత భూయిష్టమైన కవిత్వాన్ని రాస్తాడనీ, అది ఎవరికీ అర్థం కాదనీ ఒక ప్రచారం ఉంది. ఇందులో కొంత నిజం ఉంది, కొంత అబద్ధం ఉంది. విశ్వనాథ కవిత్వంలో ప్రౌఢ సంస్కృత భాషా ప్రయోగం ఎంతగా కనిపిస్తుందో, అచ్చమైన తెలుగు నుడికారం, పలుకుబడి అంతగానే కనిపిస్తాయి, చూసే కళ్ళుండాలే గాని.

తొలినాళ్ళలో రాసిన *కోకిలమ్మ పెళ్ళి*, *కిన్నెరసాని పాటలు* లాంటి కావ్యాల్లో జాను తెలుగు సౌందర్యం చాలామందికి తెలిసినదే. అయితే తర్వాత రాసిన చాలా కావ్యాలలో కూడా వాడుక తెలుగు వయ్యారాలు మనసులని ఉయ్యాలలూగిస్తూ ఉంటాయి. ఆంధ్రప్రశస్తి కావ్యాన్ని మల్లంపల్లివారికి అంకితం చేస్తూ,

"నీవనుకోను లేదు మరి నేనది చెప్పను లేదు కాని, అ
న్నా! వినవయ్య నేటికిది నా చిఱుపొత్తము నీకు నంకితం
బై వెలయింపజేతు"

అన్నప్పుడు ఆ తెలుగు పలుకుబడిలో ఎంతటి ఆత్మీయత నిండి ఉన్నదో గమనించండి!

శృంగారవీథిలో, మేలుకొలుపు అనే ఖండిక ఒకటుంది. చిన్ని కృష్ణుని నిద్రలేపే సన్నివేశం. ఆ సందర్భంలో యశోద పలుకులివి:

పక్క అంతయు జిమ్మితి పద్మనాభ!
అన్న చూడుము, పుస్తకమ్మట్లు పండు
కొనును, నీవేమొ పక్కంత కుమ్మి కుమ్మి
పక్క యటులుండ నీవిట్లు పండుకొందు

ఆ పలుకుబడి, ఆ వాక్యవిన్యాసం అచ్చమైన తెలుగు వాడుక భాష కాదూ!

ఇలా విశ్వనాథ కావ్యాలన్నిటా తెలుగు పలుకుబడి, వ్యవహార భాష మనకి దర్శనమిస్తుంది. ముఖ్యంగా శ్రీకృష్ణ సంగీతము, విశ్వనాథ మధ్యాక్కరలలో ఉన్న తెలుగు వ్యావహారిక భాషా సౌందర్యం అనన్యం! వాటిని ఇక్కడ ఉదహరించడం కన్నా ఎవరికివారు స్వయంగా చదువుకొని, అనుభవించడమే ఉత్తమం.

విశ్వనాథ కవితా వైదుష్యమంతా రాశీభూతమైన రామాయణ కల్పవృక్షంలో కూడా, తెలుగు పద సంపద, నుడికారం అడుగడుగునా కనిపిస్తాయి.

అగస్త్యుని గురించి అతని అన్నదమ్ముడు (పేరులేని అగస్త్యభ్రాత) చెప్పే కథలో ఈ పద్యాన్ని చూడండి:

అబ్బో అగస్త్యుడాతడు
సెబ్బర మానిసి! ధరిత్రి శిరసాన్చిన ఆ
గబ్బిరి గిరి తోడ నిట్లనె
అబ్బీ! మునిలోక భక్తుడై వర్ధిలుమీ!

"అబ్బో ఆ అగస్త్యుడున్నాడే, అతను మా చెడ్డ మనిషయ్యోవ్! భూమ్మీద తల ఆన్చిన గర్వాత్ముడైన ఆ పర్వతంతో అన్నాడూ, అబ్బీ! నువ్వు మునిలోక భక్తుడై వర్ధిల్లుదువుగాక"

ఇది తెలుగు పలుకుబడి పుణికిపుచ్చుకున్న సంభాషణా శైలి. సెబ్బర, గబ్బిరి మొదలైనవి తెలుగువాళ్ళు మరిచిపోయిన అచ్చ తెలుగు పదాలు.

విశ్వామిత్రుడు రామ లక్ష్మణులకి కథ చెప్పే యీ సన్నివేశం చూడండి. గంగావతరణ కథ చెప్పమని రామలక్ష్మణులు అడుగుతారు. చెప్పడం మొదలుపెడతాడు విశ్వామిత్రుడు.

అసలు కథ జెప్పెదను వినుడంచు మౌని
"పుడమి పడతికి బెట్టిన పునుగుబొట్టు
కల దయోధ్య యటన్న చక్కని పురంబు
మీరెఱుంగుదురే" యన వారు నగుచు
"మే మెఱుంగుదు" మన మౌని "మేలు మేలు
మీ రెరింగిన గథలోని మేలి సగము
నెఱుగుదురె యంట! అప్పుర మేలు దొల్లి
యనగ ననగను సగరు డన్నట్టి రాజు"

సగరుడు రాముని వంశంలోని రాజే! అతను రాజ్యం చేసినదీ అయోధ్యే. అందుకే కథ మొదలుపెడుతూనే, "భూమి అనే స్త్రీకి పెట్టిన పునుగు బొట్టు లాంటిది, అయోధ్య అని, ఒక చక్కని నగరం ఉంది. మీకు తెలుసా?" అని విశ్వామిత్రుడు అడుగుతాడు. "ఓ మాకు తెలుసు!" అని నవ్వుతూ జవాబిస్తారు రామలక్ష్మణులు. "ఓహో మంచిది, మంచిది! అయితే కథలోని మేలు సగం మీకు తెలిసిపోయినట్టే! అనగ అనగ సగరుడనే రాజు ఆ నగరాన్ని పరిపాలించేవాడు." ఇలా మొదలవుతుంది. తెలుగువాళ్ళు కథ చెప్పడంలోని ఒడుపంతా ఇందులో ఒడిసిపట్టారు విశ్వనాథ. ఈ కాలంలో ఎంతమంది పెద్దవాళ్ళు పిల్లలకి యిలా కథలు చెప్తున్నారు?

ఇలా చెప్పుకుంటూ పోతే ఇదో ఉద్గ్రంథమే అవుతుంది!

**(మిగిలిన భాగాలు వచ్చే సంచికలలో)**